# ధైర్యమే నీ కవచం

ఆ గదిలో అహల్య రమణి ఉన్నారు. ఇద్దరూ గదిలో మంటల మధ్యలో కాలిపోతున్నట్లు ఉన్నారు.

అహల్య ఒక చెక్కకుర్చీలో కూర్చుని అధైర్యంతో అయోమయంతో అల మటించిపోతూ, కొంగు కొన చేతిలో పట్టుకుని ఉబికివచ్చే కన్నీళ్ళు ఆపుకోవ టానికి ప్రయత్నిస్తోంది.

రమణి మాత్రం కిటికీ దగ్గర నిలబడి బయటికి చూస్తున్నట్టు, తన ముఖంలో భావాలు అహల్య గ్రహించకూడదన్నట్లు ముఖం తిప్పుకుని, అసహ నంతో, అవమానంతో రగిలిపోతోంది. గుండెలో సున్నపు గుల్ల ఉడకేసినట్లుం దామె స్థితి.

అయితే ఇద్దరూ ఒకరితో ఒకరు ఒక్కమాట కూడా మాట్లాడడానికి సిద్ధ పడటం లేదు. అహల్య ఎలా మాట్లాడాలో- ఏమని అడగాలో- తన ఆత్మవంచన ఎలా ప్రదర్శించుకోవాలో తెలిని స్థితిలో ఉంది. స్త్రీ ఎన్నో రకాల అవమానాలు పొందుతూ ఉంటుంది. కానీ తనలా మాత్రం అవమానం పొందడం అరుదు. అందుకే అహల్యకి నోట్లోంచి మాట పెగలటంలేదు.

రమణి మనసు భగ్గుమని అంటుకున్న తాటాకుకొంపలా ఉంది. తన ప్రమేయం ఏమాత్రం లేకుండా తన పరువు, ప్రతిష్ఠ, తన ఆత్మాభిమానం దెబ్బ

తీసే హక్కు, ఎవరిచ్చారు వీళ్ళకి? తలొంచుకుపోయే తనని ఎవరి జోలికి పోకుండా పట్టనట్లు తప్పించుకు తిరుగుతున్న తనని బజారు కీడుద్దామనా వీళ్ళ ప్రయత్నం?

ఈమె ఏ ముఖం పెట్టుకుని నా దగ్గర కొచ్చిందీ? ఇప్పుడు నన్నేమని అడగబోతోందో మరి.... వచ్చింది వచ్చినట్లు ఏడుస్తూ కుర్చీలో కూర్చుందే! నాలుగూ దులిపేద్దామని వచ్చిందేమో? మరెందు కాలస్యం? ఒక్కమాట-ఒక్కమాట వచ్చిందంటే చాలు - తనూరుకోదు. శివంగిలా మీద కురికేస్తుంది. రమణి ఆలోచనలు తీవ్రంగా సాగుతూనే ఉన్నాయి.

రమణిది చూడచక్కని రూపం. పైగా పిచ్చి పిచ్చి వేషధారణ, అలంకరణ లేకపోవడంవల్ల చూసేవాళ్ళకి ఆమె అందం రెండింతలుగా కనిపిస్తుంది. అదే చిత్రం! ఆ నిరాడంబరతలో ఎదుటివారిని విపరీతంగా ఆకట్టుకొనే ఆకర్షణ ఉంది ఆమెలో.

రమణి ఆ ఆఫీసుకి బదిలీ అయి వచ్చినప్పటినుండి ఆఫీసులో అందరికీ ఆమె ఒక కేంద్ర బిందువైంది. మంచివాళ్ళు మంచిగా, ఆమెతో స్నేహంగా, మర్యాదగా మాటలు కలిపితే, కోరచూపులు, ఓరచూపులు చూసేవాళ్ళు లేకపోలేదు.

ఆమె ఆఫీసులో చేరిన మూడు రోజులకల్లా ఒక బృందం ఆమె గురించిన విషయ సేకరణలో నిమగ్నమైంది.

రమణి అవివాహితురాలు. ఆమెకి అరవై ఏళ్ళు పైబడిన తల్లి తప్ప వేరె వరూ లేరు. తమ్ముళ్ళు ఉన్నా వాళ్ళెక్కడో ఉద్యోగాలు చేసుకుంటున్నారు.

ఇంతకీ-రమణి ఉద్యోగం చేసుకుంటున్న ఒంటరి ఆడది.

ఇదంతా మూడు వంతులమందికి ఎంతో ఉత్సాహాన్ని కలిగించింది. అవ కాశం కోసం ఎదురుచూస్తూ ఇద్దరు ముగ్గురు దిగబడిపోయారు. వాళ్ళలో ముఖ్యుడు అశోక్.

ఆరోజు నుండి అశోక్ అవసరం ఉన్నా, లేకపోయినా రమణి సీటు దగ్గర కెళ్ళి ఏదో ఒకటి మాట్లాడటం, ఆమెకి సంబంధం లేని కాగితం తీసుకెళ్ళి ఆమె దేనా అని అడగడం, ఆమె జవాబు చెప్పాక - కాసేపు కబుర్లు చెప్పి నవ్వి, నవ్వించి కాఫీ తాగుదామనీ, టీ తాగుదామనీ మాటల్లో కాలక్షేపంచేసి మళ్ళీ తన సీట్లోకొచ్చి కూర్చునేవాడు. ఇది రమణికి చిరాకుగా, ఇబ్బందిగా ఉన్నా ప్రతి విషయాన్ని గోరంతలు కొండంతలు చేసే స్వభావం కాకపోవడంవల్ల, క్షణికంగా

చిరాకుపడుతూ మళ్ళీ సర్దుకుపోతూ గడిపేసుకుంటూ వచ్చింది. అయితే అశోక్ ఆగడం రోజు రోజుకూ ఎక్కువైంది. అతను నెమ్మదిగా కథలు అల్లి ప్రచారం చెయ్యడం మొదలుపెట్టాడు.

రమణికి అశోక్ అంటే చాలా ఇష్టమని, ప్రతిరోజు ఆమె సీటు దగ్గరకెళ్ళి కాసేపైనా మాట్లాడకపోతే ఆమె చాలా కష్టపెట్టుకుంటుందనీ, అదనీ-ఇదనీ నలుగురికీ చెప్పడం మొదలుపెట్టాడు.

ఆఫీసులో అందరికీ ఇప్పుడు రమణి ఒక ఆసక్తికరమైన సబ్జెక్టయిపోయింది. అయితే ఇలాంటి విషయాలు నేరుగా రమణి దగ్గర కెళ్ళి ఎవ్వరూ ఏమీ అనలేదు. ఆమెను రహస్యంగా హెచ్చరించటానికైనా ఆమె కంత సన్నిహిత స్నేహితులు ఎవరూ లేరు. ఒకళ్ళిద్దరు రమణిని చూసి, అశోక్ విషయం తెలిసి ఆమె కసలు సంగతి చెపుదా మనుకున్నా - ఏమోలే, ఆమె కిష్టమేనేమోనని సరిపెట్టుకున్నారు. ఒక్కటే ఊహ - ఆమెకి మొగతోడు లేదు. అందువల్ల అశోక్ రొట్టె విరిగి నేతిలో పడిందేమోనని !

ఆ రోజు అనుకోని సంఘటన జరిగింది. రమణి కిచ్చిన పని పూర్తి కాలేదు. మర్నాడు చాలా అర్జెంటు పనిమీద ఆఫీసరు హెడ్డాఫీసుకి వెళుతున్నారు. ఆయన పర్సనల్‌గా పట్టుకెళ్ళాల్సిన కేసులు రెడీ చెయ్యాల్సిన పని రమణి మీద పడింది. అందువల్ల ఆమెకి ఆరోజు అయిదు గంటలు దాటిపోయినా పని పూర్తి కాలేదు. ఆఫీసులో అందరూ ఒక్కొక్కరే వెళ్ళిపోయారు. అశోక్ ఒక్కడే ఏదో పని చేస్తున్నట్లు కూర్చున్నాడు. ఒక పది నిమిషాలు ఇద్దరే ఉన్నా ఎవరి పనులు వారు చేసుకుంటున్నారు. అశోక్ కాఫీ తెప్పించాడు. రమణికి వద్దనాలని తోచలేదు. అలసిపోయిన ఆమెకి కాఫీ తాగడం అవసరం. అదేం పెద్ద తప్పుగా ప్రత్యేకంగా భావించలేదు ఆమె - అది చాలా సహజంగానే అనుకుంది.

గడియారం ముందుకు నడుస్తోంది. రమణి చకచకా పని చేసుకుపోతోంది. అంతలో ఆఫీసర్ బయటికి వచ్చి-

"మిస్ రమణీ ! నే నొక గంటలో వస్తాను, మీరన్నీ రెడీచేసి నా టేబిల్ మీద పెట్టి వెళ్ళిపోండి" - అని కాసేపాగి - "మీకు కొంచెం శ్రమే అయినా ప్లీజ్ డూ ఇట్. నేను పర్సనల్‌గా వెళితే చాలా కేసులు క్లియర్ అయిపోతాయి"అన్నాడు.

రమణి వినయంగా లేచి నిలబడి "ఎస్సార్ !" అంది.

'ఓకె'. అంటూ హడావిడిగా వెళ్ళిపోయాడు. రమణి మళ్ళీ పనిలో పడి పోయింది సీరియస్‌గా.

"నా కిందుకే ఒళ్ళు మండుతుంది" అంటూ ఆమె సీటు దగ్గర కొచ్చాడు అశోక్. వచ్చి బర్రున పక్క కుర్చీ లాక్కుని రిలాక్స్‌డ్‌గా కూర్చుని, జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించాడు.

రమణి కళ్ళెత్తి చూసింది. తన సీటు ఎదురుగా పొగ తాగుతూ, అలా విలాసంగా కూర్చోవడం ఆమె కెలాగో - చిరాగ్గా అనిపించింది.

అతని తీరు ఇబ్బందికరంగా ఉంది. బయట చీకట్లు ముసురుకుంటు న్నాయి. ఆఫీస్ బోయ్ వెళుతూ లైట్లు వేసి, రమణి దగ్గరకొచ్చి 'వాళ్ళమ్మ గారికి బాగాలేదనీ - వెళ్ళిపోతున్నాననీ - ఏం అనుకోవద్దని చెప్పి వెళ్ళిపోయాడు. అతనికి రమణిని అలా ఒంటరిగా అశోక్‌తో వదలడం ఇష్టం లేనట్టుంది. కానీ తప్పని పరిస్థితి. అందుకే పాపం 'సారీ' చెప్పి మరీ వెళ్ళిపోయాడు.

ఆఫీసులో మొత్తం సీట్లన్నీ ఖాళీగా ఉండగా మధ్యలో ఒక్కర్తీ పేపర్లతో పేచీ పడుతూ కూర్చుంది. ఓ గంటలో పని అయిపోవచ్చింది.

"నాకు ఇలాంటివాళ్ళని చూస్తే ఒళ్ళు మండుతుంది" అన్నాడు మళ్ళీ అశోక్.

అతనేం మాట్లాడుతున్నాడో అర్థం కాలేదు రమణికి. అయినా ఆమె ఏమీ అడగలేదు. అతనే మళ్ళీ అన్నాడు.

"అడగమనండి - ఇంతమంది ఆఫీసులో ఉండగా, మీరొక్కరే లేట్ అవర్సు కూర్చుని చెయ్యాలా?" అన్నాడు కోపంగా.

రమణి నెమ్మదిగా నవ్వి - "ఇది నా సీటు పనే కదండీ" అంది.

"అదేనండి మీలో ఉన్న మంచితనం. పైగా మీరు అన్ మేరీడ్ అనీ, ఎంత సేపైనా ఉంటారనీ ధైర్యం. అదే ఏ కాంచనమ్మగారినో, ప్రభావతిగారినో అడగ మనండి చూద్దాం. భారత, రామాయణాలు మొదలుపెడతారు.

రమణి మనసు చివుక్కుమంది. తనని 'అవివాహిత' అని పదే పదే ఎవ రైనా అనడం ఆమెకి బాధగా ఉంటుంది. అదేమంత తప్పు కాదే. వివాహం కాక పోవడానికి అనేక కారణాలు ఉండవచ్చు. పెళ్ళి కాకపోవడం అనేది ఓ పెద్ద నేరంగా, తన నొక దోషిగా తప్పుపట్టి, వెలితిగా మాట్లాడుతూంటే ఆమె తట్టుకో

లేకపోతోంది. నిజానికి తనకేం తక్కువని ? తనకి నచ్చిన వ్యక్తి కావాలి గానీ....

'నా గురించి ఎందుకండీ' అంది కాస్త విసుగ్గా.

"మరి వర్క్ నెత్తిమీద పడింది ఎవరికండీ?" అన్నాడు పెద్ద జోకులా నవ్వేస్తూ. 'నిజమే'ననిపించింది రమణికి. ఏం చెయ్యాలి? తను అవివాహిత అయినంత మాత్రాన ఆఫీసులో ఆరు, ఏడు గంటల వరకూ కూర్చుని పని చెయ్యాలా? ఏం? తను మాత్రం ఇంటికెళ్ళి తన పనీ, తల్లి పనీ చూసుకోవచ్చుగా? అది బాధ్యత కాదా? పెళ్ళితోనే బాధ్యతలు ఉంటాయనుకోవడం అన్యాయం కదూ !

"నన్నేం చెయ్యమంటారు ?" అంది బేలగా.

"మీరేం బాధపడకండి. కాసేపు విశ్రాంతిగా కూర్చోండి" అంటూ ఆమె చేతిలో పేపర్సు లాక్కుని పని పూర్తి చెయ్యటం మొదలుపెట్టాడు. రమణి నెమ్మదిగా లేచి ముఖం కడుక్కుని వచ్చింది.

ఏడుంపావుకి పని పూర్తి అయ్యింది. ఇద్దరూ చెయ్యడంవల్ల ఓ గంట ముందుగానే పని అయ్యింది. పేపర్సు అన్నీ సర్దేసి ఆఫీసర్‌గారి టేబుల్‌మీద పెట్టబోతుంటే ఆయనే వచ్చారు.

"అయిపోయిందా" అంటూ అశోక్‌కేసి తిరిగి - నువ్వా ఉన్నావుటయ్యా!" అన్నారు కాస్త ఆశ్చర్యంగా.

"మరే సార్. ఆమె ఒక్కరూ చేస్తున్నారని పాపం! కాస్త హెల్ప్ చేద్దామనీ...."

"గుడ్ .... దట్స్ గుడ్" అంటూ ఆయన హడావిడిగా తన రూంలోకి వెళ్ళిపోయారు.

రమణి ఆఫీసర్‌కి చెప్పి బయట కొచ్చింది. అశోక్ స్కూటర్‌తో రెడీగా ఉన్నాడు. 'చాలా థాంక్సండీ' అంది రమణి. అక్కడితో ఆమెకి అతన్ని వదిలించేసుకోవాలని ఉంది.

"రండి ! డ్రాప్ చేస్తాను" అన్నాడు చనువుగా.

రమణి గుండె దడ దడ లాడింది. బావుండదు. ఇష్టంలేదు. కానీ విపరీతమైన అలసట. అతను పనిలో హెల్పు చేశాడని కృతజ్ఞత.

"ఎందుకండీ ! బస్సులో వెళతాను" అంది.

"చాలు చాల్లెండి. మరేం ఫర్వాలేదు రండి. అసలే అలసిపోయారు. ముఖం చూడండి. ఎలా వాడిపోయిందో' అంటూనే స్కూటర్ స్టార్టు చేసేశాడు.

రమణికి ఏం చెయ్యాలో తోచలేదు. అప్పటికే చుట్టుపక్కల చాలా జతల కళ్ళు తమని గమనిస్తున్నాయని తెలుసు. ఎక్కువ గొడవపడితే బావుండదు. నడి బజారు ఇక చేసేది లేక ఎక్కి వీలైనంత వొందికగా అతణ్ణి అంటకుండా ఒదిగి కూర్చుంది. రివ్వున చల్లగాలి తగిలితే ప్రాణం లేచొచ్చినట్టయ్యింది. 'పోన్లే పది నిముషాల్లో ఇల్లు చేరిపోవచ్చు. ఎవరేమనుకుంటే ఏం? తనేం తప్పు చెయ్యటంలేదుగా!' అని తనని తనే సమర్థించుకుంది.

అశోక్ నెమ్మదిగా తల వెనక్కి పెట్టి "ఇదే మీకు పెళ్ళై, మీవారు ఉంటే మిమ్మల్నిలా కష్టపడనిస్తారా?" అన్నాడు.

రమణి గుండె ఝల్లుమంది.

కాఫీ తాగుదామా' ? అన్నాడు మళ్ళీ.

"వద్దు .... వద్దు .... వద్దండీ ! అర్జెంటుగా ఇంటికి వెళ్ళాలి ! మా అమ్మ గారు ఒక్కరే ఉంటారు." కంగారుగా అంది రమణి. ఆమె కంగారు చూసి అత నేమనుకున్నాడో, ఏమో ? తిన్నగా రమణి ఇంటివైపుకి పోనిచ్చాడు.

*　　*　　*　　*

ఆఫీసులో గుసగుసలూ, నవ్వులూ ఎక్కువయ్యాయి. అశోక్ రమణితో మాట్లాడటానికి వస్తే అక్కడెవరున్నా 'సారీ' అని చెప్పి వెళ్ళిపోయేవారు. రమణికి అలా వెళ్ళిపోవడం ఎలాగో అనిపించేది. ఆమెకి మొదట్లో ఏమీ అర్థంకాలేదు. తర్వాత తర్వాత ఆమెకి అర్థమయ్యేటప్పటికి సమయం మించిపోయింది. ఆఫీసులో తను అశోక్ తాలూకు మనిషి అని ముద్ర పడిపోయిందని, అందరూ అలా నమ్ము తున్నారని తెలుసుకుంది.

అశోక్ పెళ్ళయి ఇద్దరు పిల్లలు గలవాడు. లక్షణమైన సంసారం. పుష్కల మైన డబ్బు. మంచి ఉద్యోగం. హోదా, చక్కని భార్య - అన్నీ ఉన్నాయి. అన్నిటితో బాటూ సరదాలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. అతని సరదాల్లో భాగమే రమణితో స్నేహం. మన సమాజంలో ఒక పురుషుడికి ఇద్దరు ముగ్గురు స్త్రీలు ఉన్నారంటే అది అతని హీరోయిజాన్ని చాటుతుంది. అదే స్త్రీ పురుషుడి వంక కన్నెత్తి చూస్తే పరువు తక్కువదైపోతుంది.

అశోక్‌కి రమణిమీద విపరీతమైన మోజు ఏర్పడటానికి, అతని భార్య అందగత్తె కాకపోవడమూ, ఆమె భర్తని ఆదరంగా ప్రేమించకపోవడమూ కార ణాలు కావు. ఎందుకంటే అహల్య చక్కగా ఉంటుంది. చదువుకుంది. భర్త

అంటే ప్రేమ గలది. పువ్వుల్లో పెట్టి పూజిస్తుంది. ఆమె ఇంత ఆధునిక యుగంలో ముందే పుట్టినా, సతీసుమతి లక్షణాలు ఆమెలో లేకపోలేదు.

ఎందుకు అశోక్ మరి రమణి ఆకర్షణలో పడ్డాడు ?

అతనిలో ఎప్పట్నించో ఎవర్నైనా ఉంచుకోవాలన్న కోరిక దాగి ఉంది, ఇప్పుడు బయటపడబోతోంది. అందుకే అతను రమణి లాంటి నోరూ, బలగమూ, ధనమూలేని అబలను ఎన్నుకున్నాడు. అన్నిటికీ మించి రమణిని చూసిన క్షణం నుంచి అతని మనసు లయ తప్పింది. అతనికి కొందరు సన్నిహిత మిత్రులు చెప్పారు. ఇది మంచిది కాదని.

"ఏం పెళ్ళైనవాళ్ళు ప్రేమించడానికి అనర్హులా?" అని ఎదురుప్రశ్న వేశాడు.

"ఇలాంటి వ్యవహారాలు అశాంతికి కారణాలవుతాయి" అని హెచ్చరించారు. అతను వినలేదు.

"రేపు ఆమెకు పెళ్ళయి వెళ్ళిపోతే" .... అన్నారు కొందరు.

"ఒక్కసారి కమిట్ అయిపోతే ఇక జీవితాంతం మనతోనే ఉంటారోయ్!" అన్నాడు.

అయితే ఈ రభసవల్ల రమణికి మాత్రం అశోక్‌మీద విపరీతమైన అసహ్యమేసింది. అతణ్ణి ఒక్క క్షణం భరించలేని స్థితికి వచ్చింది. నిజానికి ఆమె ఎప్పుడు అతణ్ణి ఇష్టపడటం కానీ, ప్రేమించడం కానీ చెయ్యలేదు.

ఆ రోజు ఇద్దరిమధ్యా గొడవ జరిగింది. "నాకేం తెలీదు. నేను అందరితో లాగే కాస్త చనువుగా, స్నేహంగా ఉన్నంత మాత్రాన ఇలాంటి గొడవలు లేవనెత్తడం బాగాలేదు" అని ఏడ్చింది.

విన్నవాళ్ళూ, కన్నవాళ్ళూ ఆశ్చర్యపోయారు. కొందరు 'పిట్ట ప్లేటు ఫిరాయించింది' అన్నారు. కొందరైతే ఏదో గొడవ దాగి ఉందని తప్పుకుపోయారు.

మరికొందరు అశోక్ తరపున రమణితో రాయబారాలు నడిపారు. అతడు నీ కోసం పడి చస్తున్నాడనీ, కాదంటే నిజంగా పిచ్చోడయిపోతాడనీ, నిన్ను బాగానే చూసుకుంటాడనీ చెప్పి చూశారు.

రమణికి మతి పోయింది. అందరి సానుభూతీ అశోక్‌వైపే. "వాణ్ణి ఇష్టమొచ్చినట్లు వాడుకుంది. స్కూటర్ ఎక్కి షికార్లు కొట్టింది. ఇప్పుడు తనకేం తెలీదంటోంది" అంటున్నారందరూ. చెవులు కొరుక్కున్నారు. నిజానికి రమణి ఒకే ఒక్కసారి అతని స్కూటర్ ఎక్కింది. అంతకుమించి అతణ్ణి వాడుకున్నదేమీలేదు.

వారంరోజులుగా ఆఫీసు అట్టుడికిపోయినట్టయింది. అశోక్ గడ్డాలు పెంచి, నిద్ర లేని ఎర్రని కళ్ళతో, మాసిన బట్టలతో, అందరికీ జాలిగొలిపే విధంగా వస్తున్నాడు. ఆరోజు ఆఫీసులో కళ్ళు తిరిగి పడిపోయాడు. అతని శ్రేయోభిలాషులు అతణ్ణి హాస్పిటల్‌కి తీసుకెళ్ళారు. అతనికి పూర్తి విశ్రాంతి కావాలని డాక్టర్ అతణ్ణి ఎడ్మిట్ చేసుకున్నారు. ఆఫీసులో అంతా రమణిని ఓ వాంప్‌ని చూసినట్లు చూస్తున్నారు.

అప్పుడు కబురు వెళ్ళింది అహల్యకి. ఆమె కంగారుపడుతూ, కళ్ళనీళ్ళతో హాస్పిటల్ చేరింది. అశోక్ అనారోగ్యవంతుడేం కాదు. బలహీనుడంతకంటే కాదు. రోగాలేం లేవు. ముసలివాడూ కాదు. మరేమిటిది ?

"ఏమీ లేదమ్మా ! అతనికి పూర్తి విశ్రాంతి కావాలి. మానసికమైన ఒత్తుడుల వల్ల ఇలా అయ్యింది. భయపడాల్సినదేమీలేదు" అన్నాడు డాక్టర్.

అప్పుడే కళ్ళు తెరిచింది అహల్య. ఇన్నాళ్ళూ చెవులకి వినిపించే చాలా సంగతులు బుర్ర దాకా వెళ్ళకుండా ఆపేసింది. కానీ, తన లోపం ఎక్కడ ఉందో తెలుసుకోవాలనే ఆలోచనలో పడిపోయింది ఇప్పుడు. ఆమెకి అన్నీ అందజేశారు అశోక్ మిత్రులు.

రెండురోజులు మగత నిద్రలో పడి ఉన్నాడు అశోక్. అతణ్ణి అహర్నిశలు సేవలు చేస్తూ నిద్ర మానుకుని కాపాడింది అహల్య. మరి భార్య కదా ! అతను మధ్య మధ్యలో ఏడిచేవాడు. కలవరింతలూ - పలవరింతలూ ....

మూడో రోజున కళ్ళు తెరిచి అహల్యని చూసి ఆనందించలేదు. కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

"అహల్యా ! నేను రమణి లేకుండా బతకలేను. ఆమె లేని జీవితం వ్యర్థం. నేను లేకపోతే నీ జీవితం ఎడారి నాకు రమణి కావాలి. ఆమె ఉంటేనే నేను బతికేది. ఎలాగైనా రమణి నాకు దక్కేలా చెయ్యి!" అంటూ భోరున ఏడ్చాడు. అహల్య అవాక్కయిపోయింది.

ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. అహల్యకి తల్లీ, అమ్మమ్మ నచ్చచెప్పారు. ఏమనీ .... ? మగవాడికి ఇద్దరు భార్యలు తప్పేమీ కాదని, చిన్న చిన్న విషయాలకి కాపురాలు కూల్చుకోకూడదని.

అపుడే అహల్యలో సతీసుమతి లక్షణాలు మేల్కొన్నాయి. ఇష్టం లేక

పోయినా, మనసు చంపేసుకుని ఎలాగైనా ఒప్పించి, రమణి పొందు తన భర్తకి కలిగేలా చెయ్యాలని. ఆ విధంగా తన కాపురం నిలబెట్టుకోవాలని. కాపురం నిల బెట్టుకోవడం అంటే అర్థమే తెలీని అయోమయ స్థితిలో అహల్య రమణి ఇంటి కొచ్చింది. కానీ వచ్చినప్పటినుండీ అవమానంతో కన్నీళ్ళొస్తున్నాయిగానీ నోటంట మాట రావటంలేదు.

అందుకే ....

రమణి, అహల్య ఇద్దరూ ఆ గదిలో సెగలు పొగలు కక్కుతూ వేడిగా ఉన్నారు రమణి ఒక్క ఉదుటున వెనక్కి తిరిగింది.

"ఏమిటి ? ఎందుకొచ్చారు ? నన్నేం అడుగుదామని వచ్చారు ? నన్నే మందామని" ఆవేశంతో కఠినంగా వచ్చాయి మాటలు.

అహల్యకి కూడదీసుకున్న ధైర్యం కాస్తా కుప్పకూలిపోయింది.

"మీరు కోపగించుకోకండి. మిమ్మల్నేమీ అందామని రాలేదు. మీ సోదరి లాంటి దాన్ని" ఆగింది అహల్య.

రమణి దిమ్మెరపోయింది. మళ్ళీ అహల్యే ....

"మీరొచ్చి మా ఇంట్లో మా మధ్య ఉంటే నాకేమీ అభ్యంతరం లేదు. వారి ఆనందమే నా ఆనందం" ఆమె మాట పూర్తి అయ్యిందో, లేదో అహల్య చెంప పేలిపోయింది.

రమణి శివమెత్తినట్లు ఊగిపోయింది.

"ఛీ ఈ మాట లనడానికి నీకు సిగ్గులేదూ ? స్త్రీకి స్త్రీయే శత్రువని నిలువునా నిరూపిస్తున్నావు. భర్త పరాయి స్త్రీని కోరితే, నువ్వామె దగ్గర కెళ్ళి ఆహ్వానిస్తు న్నావా .... ?"

"నువ్వు మాట్లాడేటప్పుడు నా మనస్సేమిటో, నా గతేమిటో ఒక్క క్షణం ఆలోచించావా ? నా యిష్టాయిష్టాలు విచారించావా ? నువ్వూ - నీ మొగుడూ నిర్ణ యాలు చేసి, నామీద రుద్దితే నోరెత్తకుండా పరువు కోసం, మర్యాద కోసం బజార్న పడటం ఇష్టంలేక మీ వలలో చిక్కుకుంటాననేగా మీ ధీమా?"

అహల్య ఒక్క క్షణం ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయింది. క్షణంలో కుర్చీలోంచి లేచి - "మీ కిష్టం కాదా" అంది. ఆ క్షణంలో ఆమె ముఖంలో గొప్ప తృప్తి కనిపించింది రమణికి.

నాకా ? ఇష్టమా ? ఛీ ! ఇష్టం కాదు కదా - గొప్ప అసహ్యం. చాలా

అసహ్యం. నాకు అతనితో ఏ అనుబంధమూ లేదు. స్నేహంగా ఉన్న మాట నిజమే. అమాత్రం ఆఫీసులో పనిచేస్తూ ఉన్నప్పుడు సహజం. అంతే! నా ప్రతి కదలికకీ అర్థాలు లాగి, ఉద్దేశాలు అంటగట్టి నీ మొగుడు కథ లల్లి నన్ను నలుగురిలో తలెత్తుకోకుండా చేశాడు. ఇక ఎటూ దారిలేక ఈ ఉచ్చులో పడతానని ఎందరో ప్రయత్నం చేస్తున్నారు. అందులో మీరు కూడా ఒకరు అవుతారని నేను అనుకోలేదు.

అది కాదు రమణిగారూ! నాకేం తెలీదు. నిజంగా మీరూ ఆయనా ...."

"చాలు చాలు. మళ్ళీ మళ్ళీ అవమానించకండి! ఏం? ఏం తక్కువయిందని మీరింతగా దిగజారిపోయారు? భర్త మరో స్త్రీని కోరుకుంటే మీరు ప్రతిఘటించరా? అదే మీ రిలా కోరుకుంటే నీ భర్త సమర్థించి మీలాగే భిక్షకి వెళ్తాడా? మీకు ఆత్మాభిమానం లేదా? సిగ్గు అనిపించటంలేదా? ఇదా మీరు మీ కాపురం నిలుపుకోవడమంటేను? ఒక్కసారి ఆలోచించండి! లోపల మనసు చచ్చిపోయి, సంఘంలో గౌరవంపోయి, ఇక మీరు నిలబెట్టుకున్న దేమిటో ఆలోచించండి! వెళ్ళండి! చదువుకున్నవారు, డబ్బుకు లోటులేదు. ఆయిన వాళ్ళ అండదండలున్నవారు. మీ రెందు కిలా దిగజారిపోవడం? ఎదిరించండి! మీరు తెగతెంపులు చేసుకొంటానని బెదిరించండి! విడాకు లిచ్చి తన దారిని తనని పొమ్మనండి! అప్పుడు బయటపడుతుంది. ప్రేమో, మాయరోగమో? ఒళ్ళు కొవ్వో? అంతా బయట పడుతుంది. చిన్న లోపమొస్తే ఆడదాన్ని బజారుకి లాగే మొగవాడి కోసం, మీరు గుట్టుగా దాచి ఎందుకు కాపాడా లనుకుంటున్నారు ....?

"మీకు జరగాల్సిన అన్యాయం జరిగేపోయింది. మీ రేదో పాత చింతకాయ భావాలు పట్టుకుని అదేదో మన సాంప్రదాయం అని మిమ్మల్ని మీరు జోకొట్టుకుని ఆత్మవంచన చేసుకోకండి ...."

రమణి గొంతు జీరపోయింది. పొడారిపోయింది. గుండెలో ఆవేశం గురకలు వేస్తూ ఇక ఆపై మాట పెగలనీయలేదు.

అహల్య నెమ్మదిగా కొంగుతో ముఖం తుడుచుకుని దృఢనిశ్చయంతో గది బయటికి నడిచింది - ధైర్యం కవచంగా ధరించి.

రమణి కుర్చీలో కూలబడి తల చేతుల్లో పట్టుకుంది.

ఇప్పుడామెకి కసి తీరినట్లుగా ఉంది. బాధ తీరినట్లుగా ఉంది వంచనకు లొంగలేదని సంతృప్తిగా ఉంది. 26–6–1990 — (ఆంధ్రప్రభ)